క్లుప్తంగా

వ్యవసాయ కళాశాల సందర్శన



వ్యవసాయ కళాశాలను సందర్శించిన మహిళా రైతులు

అశ్వారావుపేటరూరల్: రైతులు తమ పొలాలకు భూసార పరీక్షలు విధిగా చేయించుకోవాలని వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు సూచించారు. గురువారం అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలను ములకలపల్లికు చెందిన గుడ్ షెపర్డ్ సంస్థ ఆధ్వర్యంలో మహిళా రైతులు సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ పావని, డాక్టర్ నీలిమ ఆధ్వర్యంలో వారికి సేంద్రియ ఎరువుల తయారీ, కిచెన్ గార్డెన్, భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

అశ్వారావుపేటరూరల్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, దీనిపై తోటి వారికి అవగాహన కల్పించాలని స్థానిక సీఐ పింగళి నాగరాజు రెడ్డి అన్నారు. గురువారం అశ్వారావుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలపై సీఐ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో వచ్చే మోసపూరిత ప్రకటనలు, గుర్తు తెలియని యాప్‌లపై జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై యయాతి రాజు, ఎంఈఓ పొన్నగంటి ప్రసాద్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

దుమ్ముగూడెం: మండలంలోని మారాయిగూడెం గ్రామంలో నీరజ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో దాదాపు 500 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్లు నీరజారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలు సీజనల్ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. క్యాంపులో సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య, ఆపక రంగయ్య, మాజీ సర్పంచ్ తిరుపతిరావు, మాజీ సర్పంచ్ మారయ్య, హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

అశ్వారావుపేటరూరల్: తెలుగుదేశం పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం కోరారు. గురువారం మండల పరిధిలోని వినాయకపురం గ్రామంలో పార్టీ మండల సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా పార్టీ మండల అధ్యక్షుడిగా నార్లపాటి శ్రీనివాసరావు, కార్యదర్శిగా బహ్మేంద్రరావు తోపాటు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా, మండల అధ్యక్షుడిగా శ్రీనివాసరావుకు రెండోసారి అవకాశం కల్పించారు. అలాగే 30 గ్రామ పంచాయతీలకు గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులను నియమించి, నియామక పత్రాలను అందించారు. పార్టీ రాష్ట్ర నాయకులు కట్రం స్వామిదొర, నియోజకవర్గ పరిశీలకులు చెరుకూరి చలపతిరావు, నాయకులు పోతురాజు నాని, చిట్టిబాబు, నార్లపాటి సుమతి, గోపి పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

దమ్మపేట: గిరిజన హక్కుల సాధనకు జూన్ 8న ఖమ్మంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఉద్యమ కార్యాచరణ సభను జయప్రదం చేయాలని కోరుతూ.. లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్, మండలంలోని నాగుపల్లి గ్రామంలో చలో ఖమ్మం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంతుల్య నాయక్, కృష్ణా నాయక్, దశరథ్, నందు, హనుమంతు, కిరణ్, లోకేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో సీట్లు

బూర్గంపాడు: సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో సారపాక బ్రిలియంట్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. గురువారం ఫలితాలు వెలువడగా.. పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు సీట్లు సాధించినట్లు కరస్పాండెంట్ బి.నాగేశ్వరరావు తెలిపారు. ఆయా విద్యార్థులను ఆయన పాఠశాల అభినందించారు.

మహాసభలపై ప్రచారం

దమ్మపేట: అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో దమ్మపేటలో ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించనున్న జిల్లా స్థాయి తొలి మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో బైక్‌లపై గురువారం ర్యాలీ నిర్వహించారు. నాయకులు పార్టీ జిల్లా నాయకులు అమర్లపూడి రాము, కుర్సం ముత్యాలరావు, పండూరి వీరబాబు, చాపా ముత్యాలరావు, రాముడు, కాంతారావు, నాగేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంటాడుతున్న డ్రెయినేజీ సమస్య

- మూసుకుపోతున్న సైడ్ డ్రెయిన్‌లు
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- వర్షాకాలంలో వరద నీటికి ఆటంకం
- నిర్లక్ష్య ధోరణిలో అధికారులు



డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం



మణుగూరురూరల్: దినదినాభివృద్ధి చెందుతున్న మణుగూరు ప్రాంతాన్ని డ్రెయినేజీ సమస్య ఇంకా వెంటాడుతూనే ఉంది. మున్సిపాలిటీ, గ్రామపంచాయతీల్లోని గ్రామాల్లో సైడ్ కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి మురుకు నీరు ప్రవహించడం లేదు. పలు కాలనీల్లో కొంతమంది భూయజమానులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం సైడ్ కాలువల్లో మట్టితో పూడిపోయేలా చేస్తున్నారు. దీంతో డ్రెయినేజీ సమస్య ఏర్పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రానున్న వర్షాకాలంలో ఈ పరిస్థితి ఇలానే సమస్య మరింత జఠిలమయ్యే అవకాశం ఉంది.

పూడుకుపోతున్న డ్రెయినేజీలు

మండల పరిధిలోని సమితిసింగారం గ్రామపంచాయతీ వాసవీనగర్, అశోక్‌నగర్, సాయినగర్, రిక్షాకాలనీ, విద్యానగర్‌కాలనీలు, ముత్యాలమ్మనగర్ ,కూనవరం గ్రామపంచాయతీలతోపాటు మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్యనగర్, ,ఆదర్శనగర్, భగత్‌సింగ్‌నగర్, శ్రీశ్రీనగర్ తదితర ప్రాంతాల్లో అంతర్గత డ్రెయినేజీలు చెత్తాచెదారంతో పేరుకుపోయాయి. అధ్వాన్నంగా దర్శనమిస్తున్నాయి. పూడుకుపోయిన సైడ్ డ్రెయిన్‌లలో మురుకునీరు ప్రవహించే దారే లేకుండాపోతోంది. మురుగు దుర్గంధం వెదజల్లుతోంది. తద్వారా ప్రజలు ముక్కులు మూసుకొని సంచరించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

పొంచిఉన్న వరద ముంపు

అస్తవ్యస్తంగా మారిన డ్రెయినేజీ వ్యవస్థతో వర్షాకాలంలో వరద ముంపునకు గురికాక తప్పదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే మున్సిపాలిటీపంచాయతీల్లో పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు ప్రతిఏటా వర్షాకాలంలో వరద ముంపునకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో డ్రెయినేజీలు ఇలాగే పూడుకుని ఉంటే రానున్న వర్షాకాలంలో వరద నీరు ప్రవాహానికి ఆటంకం ఏర్పడి.. మరలా పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశాలు లేకపోలేదు. అదే జరిగితే ప్రజల్లో అధికారులు, పాలకులపై ఆగ్రహావేశాలు కట్టలుతెంచుకునే అవకాశం ఉంది.

పట్టింపులేని అధికారులు..

డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ.. సంబంధిత అధికారులు నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తున్నారు. నెలల తరబడి చెత్తాచెదారమంతా పూడుకుపోతున్నా శుభ్రం చేయించిన దాఖలాలు లేవు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారుల్లో చలనం రావడం లేదు. అధికారుల ఈ ధోరణిపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, మణుగూరు ప్రాంతంలోని కోడిపుంజుల వాగులో పూడికతీత పనులు నిర్వహించి వర్షాకాలంలో వరదనీటి ప్రవాహానికి వీలుగా చేయాల్సి ఉండగా.. నేటి వరకు ఆ దిశగా చర్యలేమీ చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఖాళీ బిందెలతో నిరసన



గ్రామస్తులను సముదాయిస్తున్న పోలీస్ సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని మారుతీనగర్ కాలనీలో గడిచిన ఐదు రోజులుగా తాగునీటి సమస్య నెలకొని ఉంది. ఈ సమస్యను పరిష్కరించకపోవడంతో గ్రామస్తులు, మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న తాగునీటి బోరు మరమ్మతులకు గురి కాగా,, గురువారం మోటారుకు రిపేరు చేసి బిగించిన గంట వ్యవధిలోనే ఆగిపోయిందని తెలిపారు. సాయంత్రానికి కూడా మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోలేదని, దీంతో తామంతా తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నట్లు వాపోయారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక పోలీస్ సిబ్బంది ఆందోళన చేస్తున్న వారి వద్దకు వెళ్లి సమస్యను పరిష్కరించేలా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. దాంతో గ్రామస్తులు ఆందోళనను విరమించారు.

విస్తరణ పనులకు సహకరించాలి



రింగ్ రోడ్డు సెంటర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ సుజాత

అశ్వారావుపేటరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారుల విస్తరణ, డ్రెయినేజీ, సెంట్రల్ లైటింగ్ పనులకు సహకరించాలని కమిషనర్ సుజాత కోరారు. గురువారం రింగ్‌రోడ్డు సెంటర్‌లోని ఫారెస్టు చెక్‌పోస్టు, సీపీఐ కార్యాలయం, దుకాణాలను ఆమె పరిశీలించారు. కాగా, డ్రెనేయిజీ నిర్మాణానికి సీపీఐ కార్యాలయం, దుకాణాలు అడ్డుగా ఉన్నాయని, స్థానిక ఆర్అండ్‌బీ అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వాటిని పరిశీలించి ప్రైవేటు స్థలాలు ఉంటే ఆధారాలు సమర్పించాలని లేని పక్షంలో అభివృద్ధి పనులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీఐ పింగళి నాగరాజు రెడ్డి, మున్సిపాలిటీ సిబ్బంది ఉన్నారు.

‘సీతారామ’ జలాలకు కృషి



రైతులకు జీలుగు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాయం

అశ్వాపురం: మండలంలోని రైతుల శ్రేయస్సు కోసం సీతారామ ప్రాజెక్ట్ ద్వారా తుమ్మలచెరువుతో పాటు పలు చెరువులకు గోదావరి జలాలు అందించి, మండలంలో సుమారు 20 వేల ఎకరాలు సాగు అయ్యేలా కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నెల్లిపాక పీఏసీఎస్ కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రైతులకు సబ్సిడీపై జీలుగు విత్తనాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మండల కేంద్రంలో చింతలచెరువు వద్ద యాదవులచే నూతనంగా నిర్మించిన గంగ గుడిలో గంగమ్మ, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఏడీఏ తాతారావు, ఏఓ చటర్జీ, ఏఈఓ రమాదేవి, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు కమటం సురేష్, సీఈఓ వెంకట్, డైరెక్టర్లు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సైడ్ డ్రెయిన్‌లకు భూమిపూజ

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని బాపనకుంట నుంచి పీకే–1 సెంటర్ వరకు రూ.55లక్షల వ్యయంతో నిర్మించనున్న సైడ్ డ్రెయిన్ పనులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నవీన్, శివసైదులు, తరుణ్‌రెడ్డి, కుర్రం రవి, కూచిపూడి బాబు, జగన్, నాగేశ్వరరావు, స్థానికులు బాలు, పబ్లిక్ హెల్త్ ఏఈ సత్య, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

23 నుంచి ఉచిత క్రికెట్ శిక్షణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని రూపా స్కూల్‌లో ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కోచ్ సుబ్బు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ శిక్షణ శిబిరంను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ఏర్పాటు చేసిన మూడు సెంటర్లలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం మొదటి సంవత్సరం పరీక్షకు మొత్తం 142 మంది విద్యార్థులకు గాను 127 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెకండియర్ పరీక్షకు 45 మందికిగాను 42 మంది హాజరయ్యారు.

ప్రజాసమస్యలపై ధర్నా

అశ్వాపురం: మండలంలో 24 గ్రామ పంచాయతీల్లోని నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఎంపీఓ ముత్యాలరావు, ఆర్ఐ లావణ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రేపాకుల శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యుడు గద్దల శ్రీనివాసరావు, మండల కార్యదర్శి పాయం నరసింహారావు, నాయకులు సాంబశివరావు, పినికేసి సుధాకర్‌రెడ్డి, పగడాల అశోక్‌రెడ్డి, దండి రాములు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల నివాళి

అశ్వాపురం: సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బలుగూరి మధు తండ్రి మండల పరిధిలోని సీతరాంపురం గ్రామానికి చెందిన బలుగూరి రామిరెడ్డి (65) అనారోగ్యంతో గురువారం మరణించారు. రామిరెడ్డి మృతదేహానికి సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య, నాయకులు నివాళులు అర్పించారు. మధును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రేపాకుల శ్రీనివాస్, నెల్లూరి నాగేశ్వరరావు, గద్దల శ్రీనివాస్, సాంబశివరావు పాల్గొన్నారు.

నర్సయ్య వర్ధంతి సభ

గుండాల: ఉమ్మడి గుండాల సీపీఎం దివంగత మండల కార్యదర్శి జోగ నర్సయ్య వర్ధంతి సభను మండలంలోని తూరుబాక గ్రామంలో గురువారం ఏర్పాటు చేశారు. తోలెం గోపి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రేపాకుల శ్రీనివాస్ మాట్లాడారు. జోగ నర్సయ్య స్ఫూర్తితో ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దుగ్గి రాంమూర్తి, కల్తి సమ్మయ్య, జగదీష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ధర్ముల లక్ష్మి..

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని నందిపాడు గ్రామంలో గురువారం పార్టీ సీనియర్ నాయకురాలు ధర్ముల లక్ష్మి సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పాల్వంచ డివిజన్ నాయకులు గోగినపల్లి ప్రభాకర్ మాట్లాడారు. నాయకులు వాసం బుచ్చిరాజు, కారం మల్లేష్, కారం రాజులు, కారం మల్లయ్య, రాంబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

పర్సా సత్యనారాయణ..

మణుగూరురూరల్: స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం పర్సా సత్యనారాయణ పదో వర్ధంతిని నిర్వహించారు. తొలుత సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య పర్సా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, సత్రపల్లి సాంబశివరావు, కొడిశాల రాములు, బొల్లం రాజు, నందం ఈశ్వర్‌రావు, వల్లూరు వెంకటరత్నం, హేమంతరావు, నరసయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ

మణుగూరు తహసీల్దార్‌గా నరేష్



గోపాలకృష్ణ



అద్దంకి నరేష్

మణుగూరురూరల్: మండల కేంద్రంలోని మణుగూరు తహసీల్దార్ కార్యాలయంలో మండల తహసీల్దార్‌గా అద్దంకి నరేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల బదిలీపై వచ్చిన ఇమ్మాన్యుయేల్ మల్టీజోన్ పరిధిలో మహబూబాబాద్‌కు బదిలీపై వెళ్లగా.. పినపాకలో తహసీల్దార్‌గా పని చేస్తున్న అద్దంకి నరేష్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్థానిక క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేయగా.. ఎమ్మెల్యే పాయం శుభాభినందనలు తెలిపారు.

పినపాక తహసీల్దార్‌గా గోపాలకృష్ణ

పినపాక: పినపాక నూతన తహసీల్దార్‌గా గొంది గోపాలకృష్ణ గురువారం తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. పాల్వంచ డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న గోపాలకృష్ణను ఇన్‌చార్జ్ తహసీల్దారుగా పినపాకకు బదిలీ చేశారు.

భద్రాచలం తహసీల్దార్‌గా జగదీశ్వరప్రసాద్



జగదీశ్వరప్రసాద్

భద్రాచలంటౌన్: భద్రాచలం మండల తహసీల్దార్‌గా జగదీశ్వరప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో భద్రాచలంలో పనిచేసిన టి.శ్రీనివాసరావు జూలూరుపాడుకు బదిలీ కాగా.. అన్నపరెడ్డిపల్లి మండల తహసీల్దార్‌గా ఉన్న జగదీశ్వరప్రసాద్‌ను భద్రాచలానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన జగదీశ్వరప్రసాద్‌కు సిబ్బందితో పాటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్‌కౌంటర్‌ను ఖండించాలి

గుండాల: సీపీఐ మావోయిస్టు కేంద్రకమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావును చంపడం బూటకపు హత్య అంటూ గురువారం న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు, కాచనపల్లిలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ నాయకులు ముక్తి సత్యం మాట్లాడుతూ.. మావోయిస్టులపై దాడుల పేరుట కేంద్రం అమాయక గిరిజనులను బలితీసుకుంటోందని, వెంటనే వారితో శాంతి చర్చలు జరపాలని అన్నారు. నాయకులు కోరం సీతారాములు, అరెం నరేష్, యాసారపు వెంకన్న, మానాల ఉపేందర్, లాలు, గోపాల్, పాయం రమేష్, ఈసం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విచారణ జరిపించాలి

భద్రాచలంటౌన్: మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు అలియాస్ గంగన్న ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరిపించాలని యువతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి గుజ్జుల గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఒక సీనియర్ సుప్రీం లీడర్ ఇటువంటి ఒక చిన్న ఎన్‌కౌంటర్‌లో మరణించడం అనుమానస్పద విషయంగా భావించి తక్షణమే సుప్రీంకోర్టు న్యాయ విచారణ జరిపించాలని, ఓ కమిటీతో ఛత్తీగఢ్‌లో జరుగుతున్న అన్ని ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

చంద్రుగొండ: ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల నాయకుడు వరికూటి వెంకట్రావ్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావును ఆయన సహచరులను అతి కిరాతకంగా చంపి కేంద్రప్రభుత్వం పైశాచిక ఆనందం పొందుతోందని ఆయన అభివర్ణించారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

ములకలపల్లి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎంపీడీఓ గద్దె రేవతి, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి మంజూరీ పత్రాలు పంపిణీ చేశారు. స్థానిక జీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభాకర్ రావు మాట్లాడారు. ములకలపల్లి జీపీ పరిధిలోని 72 మంది లబ్ధిదారులకుగాను, 66 మందికి మంజూరీ పత్రాలు అందజేశారు. అనంతరం పలువురి ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. హౌసింగ్ ఏఈ శ్రీధర్, జీపీ కార్యదర్శి రవి, మాజీ సర్పంచ్ కారం సుధీర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు గాడి తిరుపతిరెడ్డి, మిరాయాల అవినాష్, సురభి రాజేశ్, కొప్పుల రాంబాబు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి వేడుకలు

హనుమాన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. వివిధ గ్రామాల్లోని ఆంజనేయ ఆలయం, విగ్రహాల వద్ద ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలను, అభిషేకాలను నిర్వహించారు. ఆలయాల్లో స్వామిని సింధూరం, పూలతో అలంకరించగా.. భక్తులు దర్శించుకున్నారు. అనంతరం హనుమాన్‌చాలీసాను పఠించి తీర్థప్రసాదాలు అందించారు. అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు ర్యాలీలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



దుమ్ముగూడెం: పర్ణశాల ఆలయంలో భక్తుల తాకిడి..



అన్నపురెడ్డిపల్లి: వేంకటేశ్వరస్వామి ఆలయంలో హనుమత్ చాలీసా పారాయణం..



గుండాల: ఆళ్లపల్లిలో కోలాటం వేస్తున్న మహిళలు



మణుగూరుటౌన్: పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



అశ్వారావుపేటరూరల్: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

టిప్పర్ డ్రైవర్లకు అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ చంద్రశేఖర్

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): టిప్పర్ లారీ డ్రైవర్లు ఓనర్లకు అన్నపురెడ్డిపల్లిలోని స్టేషన్‌లో పోలీసులు గురువారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సీహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పరిమితికి మించి లోడ్ వేయవద్దని, మూలమలుపులు, రాత్రి వేళల్లో ఇసుక, కంకర, బొగ్గులోడ్లతో వెళ్తున్న క్రమంలో నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. ఇకపై జాగ్రత్తలు పాటించని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన డ్రైవర్లకు హెచ్చరించారు.

బడిలో సదుపాయాలకు కృషి



బోరు, మోటారును ప్రారంభించిన దాత సీతారామస్వామి

అశ్వారావుపేటరూరల్: ఏడాదికి ఒక ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తానని లయన్స్‌క్లబ్ బాధ్యులు కోటగిరి సీతారామస్వామి ప్రకటించారు. గురువారం మండల పరిధిలోని ఊట్లపల్లి గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో తల్లిదండ్రులు సుబ్బారావు–లక్ష్మీనరసాయమ్మ జ్ఞాపకార్థంగా సుమారు రూ.2లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన బోరు, మోటారును ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం దాతను గ్రామస్తులు, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో కాసాని వెంకటేశ్వరరావు, సుంకవల్లి వీరభద్రరావు, యూఎస్ ప్రకాష్‌రావు, తాడేపల్లి రవి, కాసాని చంద్రమోహన్, బండారు శ్రీనివాసరావు, సంకా ప్రసాద్, పుల్లారావు, కోడూరి నాగు పాల్గొన్నారు.

కారుణ్య నియామకపత్రాల అందజేత

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని జీఎం కార్యాలయంలో సింగరేణిలో పని చేస్తూ మెడికల్ ఇన్‌వాలిడేట్ అయిన ఎనిమిది మంది ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామకం క్రింద నియామకపత్రాలను గురువారం ఏరియా జీఎం దుర్గం రామచందర్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం డి.శ్యాంసుందర్, డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్, ఏఐటీయూసీ బ్రాంచ్ నాయకులు రాంనర్సయ్య, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.కృష్ణంరాజు, సెక్యూరిటీ అధికారి కె శ్రీనివాస్, సీనియర్ పీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ సాయినగర్‌లో ఉన్న శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో సాయినాథుడికి గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రేణం శ్రీకాంత్–రాధిక దంపతులు, వారి కుమారులు గణేష్ సాయిరాం, విగ్నేష్ సాయిరాం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా.. ఆలయ కమిటీ సభ్యులు సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు ఆలస్యం!

- మే నెలాఖరైనా అందని విత్తనాలు
- పొలాలను బీడుగా వదిలేసిన రైతులు



కరకగూడెంలో విత్తనాలు అందక సాగు భూమిని ఖాళీగా ఉంచిన దృశ్యం

కరకగూడెం: మే నెల మూడోవారం వచ్చినా మండలానికి జీలుగు విత్తనాలు చేరలేదు. వరి కోతలు పూర్తయిన వెంటనే జీలుగు (పచ్చిరొట్ట) విత్తనాలను భూమిలో చల్లుతారు. ఈ విత్తనాలు భూమిలో మొలకెత్తి రెండు నెలల పాటు పెరిగిన తర్వాత వాటిని భూమిలోనే దున్నేస్తారు. ఇలా చేయడం వల్ల భూమికి సహజ పోషకాలు అందుతాయి. రసాయన ఎరువుల వినియోగం తగ్గి భూమి సారవంతం అవుతుంది. ఇది రైతులు సంవత్సరాల తరబడి అనుసరించిన ఒక సంప్రదాయిక వ్యవసాయ పద్ధతి. కానీ ఈ ఏడాది ఈ పద్ధతికి అడ్డంకులు ఎదురవుతున్నాయి. సాధారణంగా ఏప్రిల్ నెలాఖరులో ఈ విత్తనాలను చల్లే పని ప్రారంభమవుతుంది. జూన్ నెలాఖరు వరకు జీలుగ మొక్కలు పెరిగి, భూమికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. కానీ ఈ సారి మే నెల మూడో వారం వచ్చినా జీలుగ విత్తనాలు మండలానికి చేరలేదు. వరి కోతలు పూర్తై నెల రోజులు గడిచినా రైతులకు విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో వారు తమ పొలాలను చదును చేయకుండా అలాగే వదిలేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని పలువురు కోరుతున్నారు.